E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 22-05-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం » 3లో


దిల్లీ ఇంటికి..
చివరి ప్లే ఆఫ్స్ బెర్తు ముంబయిదే » 6లో



మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన సూచీలు » 4లో



కేన్స్ లో జాన్వీ ఎంతో స్పెషల్ » 5లో



గూగుల్ మీట్‌లో రియల్ టైమ్ ట్రాన్స్‌లేట్ ఫీచర్.. ఎలా పని చేస్తుందంటే? » 4లో



# మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు(70) అలియాస్ బసవరాజు మృతి చెందారు.



**పలువురు కీలక నేతలు సహా మొత్తం 27 మంది మృతి**
**ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్ అడవుల్లో నెత్తుటి ధారలు**
**పక్కా సమాచారంతో భద్రతా దళాల ఆపరేషన్**
**బుధవారం తెల్లవారుజామున గర్జించిన తుపాకులు**
**కేశవరావు మరణించినట్టు ప్రకటించిన అమిత్ షా**
**అసాధారణ విజయం అన్న ప్రధాని మోదీ**
**నంబాలపై కోటిన్నర రూపాయల రివార్డు!**

ఈ కబురు:ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్, జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (71) మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో పలువురు కీలక నేతలు సహా మొత్తం 27 మంది మావోయిస్టులు కూడా మరణించారు. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్-బీజాపూర్ జిల్లా సరిహద్దు అబూజ్‌మఢ్ అడవుల్లో ఇంద్రావతి నది పరీవాహక ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ డీఆర్‌జీ జవాను కూడా మృతి చెందగా పలువురు గాయపడినట్లు ఛత్తీస్‌గఢ్ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కేశవరావు మరణాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ధ్రువీకరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఓ మావోయిస్టు నేత ఎదురుకాల్పుల్లో మరణించడం ఇదే మొదటిసారని తెలిపారు. ప్రధాని మోదీ కూడా ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. 'ఇదో అసాధారణ విజయం' అని పేర్కొన్నారు. కేశవరావు తలపై కోటిన్నర రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. కాగా మావోయిస్టు ఉద్యమానికి వెన్నెముక గా ఉన్న నంబాల మృతి మావోయిస్టు పార్టీకి పెద్ద ఎదురుదెబ్బని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన కేశవరావు వరంగల్ ఆర్ఈసీ (ఇప్పటి నిట్)లో ఎంటెక్ చదువుతూ అజ్ఞాతంలోకి వెళ్లారు.

తరువాయి 2లో

## పాకిస్తాన్‌తో చర్చలు జరిపారు..
### మావోయిస్టులతో జరపడానికి ఏంటి బాధ



ఈ కబురు: ఛత్తీస్‌గఢ్‌లో సీపీఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మరో 27 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం పట్ల సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని ఆయన అన్నారు. సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శించడాన్నీ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి సమస్యకైనా చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చరిత్ర రుజువు చేస్తుందని కూనంనేని అన్నారు. తక్షణమే ఆపరేషన్ కగారు నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్.. నక్సలిజంపై
### పోరాటంలో ఘన విజయమంటూ మోదీ




ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై స్పందించిన ప్రధాని మోదీ .. భద్రతా దళాల విజయం పట్ల గర్వంగా ఉందని అన్నారు.

**ఈ కబురు,ఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు.**

తరువాయి 2లో

## నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో
### ఒక మైలురాయి విజయం



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాద్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం అని పేర్కొన్నారు.

**ఈ కబురు,న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతి చెందాడంటూ అమిత్ షా ట్వీట్ చేశారు**

తరువాయి 2లో

## కాంగ్రెస్, భాజపా
### నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు: కేటీఆర్



**నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

ఈ కబురు,నల్గొండ: నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి ఇలాంటి పనులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ప్రజాపాలన.. కమీషన్ల పాలనగా మారిందని ఆరోపించారు.

తరువాయి 2లో

## పాక్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు: సీఎం రేవంత్

**ఇందిరాగాంధీ హయాంలో పాక్‌కు గట్టి గుణపాఠం**
**చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాహుల్‌పై విమర్శలు**
**దేశ భద్రత, సమగ్రత విషయంలో జవాన్లకు అండగా ఉంటాం**
**రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**



సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్: పహల్గాం దాడి ఘటన నేపథ్యంలో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని మోదీ వెనకడుగు వేశారని.. అదే ఇందిరమ్మ హయాంలో ఉగ్రవాదుల ముసుగులో భారత పౌరులపై దాడులకు తెగబడిన పాక్‌కు గట్టి గుణపాఠం చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సచివాలయం ముందు ఆయన విగ్రహానికి రేవంత్ పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ వర్ధంతి రోజున 'ఉగ్రవాద వ్యతిరేక దినం'గా పాటిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ.. ఉగ్రవాదంపై పోరాటం చేయడం ప్రతి భారతీయుడి దృఢ సంకల్పమన్నారు.
దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జవాన్లకు ఎప్పుడూ అండగా నిలబడతామని చెప్పారు. కశ్మీర్‌లో పర్యాటకులపై కాల్పుల ఘటన, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించిందని గుర్తుచేశారు.

తరువాయి 2లో

## నేషనల్ హెరాల్డ్ కేసు..
### సోనియా, రాహుల్‌పై ఈడీ సంచలన ఆరోపణ

**కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై ఈడీ సంచలన ఆరోపణలు చేసింది.**

ఈ కబురు,ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ పై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ధి పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది.
నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది.



తరువాయి 2లో

## కృష్ణా జలాలలో తెలంగాణకు అన్యాయం..
### గత ప్రభుత్వం వల్లే : మంత్రి ఉత్తమ్

ఈ కబురు: కృష్ణ జలాల నీటి వాటాల పంపకాలలో గతంలో 811 టీఎంసీలకు కేటాయింపులో ఆంధ్రాకు 512 టీఎంసీలు తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని దీనివలన తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని గత పదేళ్లు పాలన చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి పంపకాలలో ఏనాడు కొట్లడ లేదని వారు కేటాయించిన 299 టీఎంసీల నీరు సరిపోతాయని అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా రాసి రాశి ఇచ్చి తెలంగాణకు నష్టం చేశారని రాష్ట్ర నీటిపారుదల పౌరసరపాల శాఖ మంత్రి ఎన్ . ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.

తరువాయి 2లో



## రాష్ట్రంలో మూడ్రోజుల పాటు వర్షాలు.. అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ కీలక ఆదేశాలు

**ఈ కబురు: హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షా లుపడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

» 2లో



## సెలవుల్లో పనిచేయడానికి లాయర్లు ఇష్టపడటం లేదు: సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడటం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

**ఈ కబురు,ఢిల్లీ: కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్న అంశంపై భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. లాయర్లు సెలవు దినాల్లో పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. వేసవి సెలవుల అనంతరం తన కేసును విచారించాలని ఓ న్యాయవాది కోరారు.**

» 3లో



మొదటి పేజీ తరువాయి



# పాక్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు: సీఎం రేవంత్

దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జవాన్లకు ఎప్పుడూ అండగా నిలబడతామని చెప్పారు. కశ్మీర్‌లో పర్యాటకులపై కాల్పుల ఘటన, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించిందని గుర్తుచేశారు.

నాడు ఇందిర అంగీకరించలేదు...: ఉగ్రవాదులను నిర్మూలించడంలో ఇందిరమ్మ ఆదర్శంగా నిలిచారని, నాడు యుద్ధం సందర్భంగా అమెరికా లేదా ఇతర దేశాల మధ్యవర్తిత్వాన్ని ఆమె అంగీకరించలేదని రేవంత్‌రెడ్డి చెప్పారు. భారత దేశ భద్రతను కాపాడుకోవడంలో ఎవరి సూచనలు, మధ్యవర్తిత్వం అక్కర్లేదని స్పష్టంగా చెప్పారన్నారు. ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు.


కశ్మీర్ ఘటనలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు అందరం కేంద్రానికి, పోరాటం చేస్తున్న వీర జవానులకు అండగా నిలబడ్డామన్నారు. -చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. రాహుల్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు.

దేశ సమగ్రతను కాపాడటంలో కృషిచేసిన మహాత్మాగాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, బీఆర్ అంబేడ్కర్, పీవీ నరసింహారావు విగ్రహాలతో ఈ ప్రాంతం భారతీయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ పాత్ర మరువలేనిదని కొనియాడారు.

ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఓటు హక్కు కల్పించారని, ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో 21వ శతాబ్దం వైపు దేశాన్ని నడిపించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి



### పక్కా సమాచారంతో..

అబూజ్‌మడ్ అడవుల్లో ఇంద్రావతి నది సమీపాన మావోయిస్టు అగ్రనేత షెల్టర్ తీసుకున్నారని, పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులతో పాటు మాడ్ డివిజన్ సీనియర్ కేడర్, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) సభ్యులు సైతం ఉన్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలకు తోడు నారాయణపూర్, దంతెవాడ, బీజాపూర్, కొండగావ్ జిల్లాల డీఆర్‌జీ దళాలు మంగళవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టాయి. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇరువర్గాల మధ్య మొదలైన కాల్పులు ఉదయం 11గంటల వరకు కొనసాగాయి. ఈ కాల్పుల్లో మధు, నవీన్ అనే డివిజన్ స్థాయినేతలు కూడా మరణించినట్లు తెలుస్తోంది. మధు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కాగా, నవీన్ మావోయిస్టు పార్టీ పత్రిక 'జంగ్' బాధ్యతలు చూస్తున్నట్లు సమాచారం. ఆపరేషన్ జరిగిన తీరుతెన్నులు, ఇతర మృతుల వివరాలను పోలీసులు ప్రకటించలేదు. అయితే 27 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా మావోయిస్టుల కోసం గాలింపు ఇంకా కొనసాగుతోందని పోలీసులు చెప్పారు.

**ల్యాప్‌టాప్‌లు, కీలక డాక్యుమెంట్లు ఆధారంగా..**

గతనెల 18న నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఆపరేషన్‌లో మావోయిస్టులకు సంబంధించిన డంప్‌ను భద్రతా దళాలు కనుగొన్నాయి. ఇందులో కీలక డాక్యుమెంట్లు, పుస్తకాలతో పాటు 11 ల్యాప్‌టాప్‌లు లభించాయి. వాటిలో లభించిన వివరాల ఆధారంగానే ఏప్రిల్ 21న తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టల్లో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ భారీ స్థాయిలో మొదలైందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే కర్రిగుట్టల ఆపరేషన్‌తో భారీ ఫలితం రాబోతుందని ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఆపరేషన్ ముగిసేసరికి వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 31 మంది సాధారణ స్థాయి మావోయిస్టులు చనిపోగా డంప్‌లు, ఆయుధ తయారీ పనిముట్లను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మళ్లీ విశ్లేషించుకుని..'వారి' నుంచి సమాచారం తెప్పించుని.. డంప్‌లో లభించిన ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లలో లభించిన సమాచారాన్ని విశ్లేషించుకోవడంలో జరిగిన పొరపాటు కారణంగానే కర్రిగుట్టలో ఆశించిన విజయం దక్కలేదని భావించిన దళాలు మరింత జాగ్రత్తగా సమాచారాన్ని విశ్లేషించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా నంబాల కేశవరావుకు రక్షణ కల్పించే 7వ నంబర్ కంపెనీలో పనిచేసి లొంగిపోయిన కొందరు మావోయిస్టుల నుంచి మరోసారి సమాచారం తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఈ రెండింటినీ కచ్చితత్వంతో డీకోడ్ చేయడం ద్వారా నంబాల ఎక్కడున్నాడనే అంశాన్ని భద్రతా దళాలు పసిగట్టి మెరుపుదాడి చేసినట్టు తెలుస్తోంది.

**అంత ఈజీగా ఎలా?**

సాధారణంగా కేంద్ర కమిటీ సభ్యులకు మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. ఈ వలయాన్ని ఛేదించుకుని వారి దగ్గరికి చేరుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. అయినా స్వల్ప నష్టంతోనే పోలీసులు నంబాల దగ్గరికి ఎలా చేరుకున్నారనేది మిస్టరీగా మారింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఏడాది క్రితం వరకు నంబాల కేశవరావుకు 70 మందితో కూడిన కంపెనీ రక్షణ కల్పించేది. ఇందులో కనీసం 40 మంది వద్ద ఏకే 47 లాంటి అత్యాధునిక ఆయుధాలు ఉంటాయని, తన చుట్టూ ఉన్న బృందం ఆధునిక ఆయుధాలతో ఉంటే నంబాల తన చేతిలో ఎప్పుడూ ల్యాప్‌టాప్‌తో ముందుకు సాగుతారని తెలుస్తోంది. తాగునీరు, ఆహారం విషయంలోనూ ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారని, రాత్రి వేళ సైతం రెండు, మూడు గంటల కంటే ఎక్కువ నిద్రించరని సమాచారం. అయితే ఇటీవల పెరిగిన నిర్బంధం కారణంగా భద్రతను 28 మందికి కుదించినట్టు తెలుస్తోంది.

మొదటి పేజీ తరువాయి

### పాకిస్తాన్‌తో చర్చలు జరిపారు.. మావోయిస్టులతో జరపడానికి ఏంటి బాధ



**చర్చలు జరపండి: చాడ డిమాండ్**

ఎన్‌కౌంటర్ చేయకుండా మావోలతో చర్చలు జరపాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షాలు మావోయిస్టుల, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడం లక్ష్యంగానే ఆపరేషన్ కగార్ చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉగ్రవాదుల కంటే దారుణంగా మావోయిస్టులపై సీతకన్ను ప్రదర్శిస్తున్నారని అన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ఒక నెల రోజులు కింద ప్రకటించినా చర్చలు జరపకుండా మావోయిస్టుల ఏరువేత లక్ష్యంగా ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు నమ్మిన సిద్ధాంతం కోసం ఆ మార్గం ఎంచుకున్నారన్నారు. దేశం, రాష్ట్రంలో బీజేపీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడ అహం దెబ్బతింటుందోనని ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో చర్చలు జరుపుతున్నారు తప్ప, మన భారతదేశ పౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు పౌర హక్కులను కాలరాయడమే అవుతుందని వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

# నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం


ఈ కబురు,న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతి చెందాడంటూ అమిత్ షా ట్వీట్ చేశారు. మావోలపై మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి స్థాయి నేత చనిపోవడం ఇదే ప్రథమమన్నారు. ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టుల మృతి చెందారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్విట్టర్‌లో తెలియజేశారు.

అమిత్ ట్వీట్ ఇదే

నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం. ఈరోజు, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో మన భద్రతా దళాలు 27 మంది భయంకరమైన మావోయిస్టులను మట్టుబెట్టాయి. సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నాయకుడు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజంపై భారత్ చేసిన మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నాయకుడిని మన దళాలు మట్టుబెట్టడం ఇదే మొదటిసారి. మావోయిస్టులను హతమార్చిన మన ధైర్యవంతులైన భద్రతా దళాలు , ఏజెన్సీలను అభినందిస్తున్నాను. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత 54 మంది నక్సలైట్లను అరెస్టు, 84 మంది నక్సలైట్లు లొంగిపోయారని తెలియజేయడం సంతోషంగా ఉంది. మార్చి 31, 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది అంటూ అమిత్ షా ట్వీట్ చేశారు.

కాగా.. ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే మరికొంత మంది మావోయిస్టులకు గాయాలయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతిచెందాడు. 1955లో శ్రీకాకుళం జిల్లా జీఅన్న పేటలో కేశవరావు జన్మించారు. వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. విద్యార్థి దశలో వామపక్ష విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొని, రాడికల్స్ స్టూడెంట్ యూనియన్ సభ్యుడిగా పనిచేశారు. 1980లో విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణలో అరెస్ట్ అయిన తర్వాత స్వగ్రామాన్ని వదిలి నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లారు. మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు నంబాల.1980లో ఏర్పడిన సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్‌లో ముఖ్యమైన సభ్యుడిగా ఉన్నారు.

1987లో అంబుష్ వ్యూహాలు, పేలుడు పదార్థాల వినియోగంపై శిక్షణ పొందారు. 2004లో సీపీఐ పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా విలీనంతో ఏర్పడిన మావోయిస్టు పార్టీకి కేంద్ర సైనిక కమిషన్ అధిపతిగా నియమితులయ్యారు. 2018 నవంబర్ 10న ముప్పల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి రాజీనామా చేసిన తర్వాత నంబాల కేశవ్ రావు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గెరిల్లా యుద్ధ వ్యూహాలు, పేలుడు పదార్థాల వినియోగంలో నంబాల నిపుణుడు. నంబాలపై ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. భద్రతా దళాలపై జరిగిన పలు ప్రధాన మావోయిస్టు దాడుల్లో నంబాల పాత్ర కీలకం. నంబాల కేశవరావుపై ఒక కోటి రివార్డు కూడా ఉంది. నంబాల భార్య కూడా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుకుగా ఉన్నారు.



మొదటి పేజీ తరువాయి

### ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్.. నక్సలిజంపై పోరాటంలో ఘన విజయమంటూ మోదీ పోస్ట్

**ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై స్పందించిన ప్రధాని మోదీ .. భద్రతా దళాల విజయం పట్ల గర్వంగా ఉందని అన్నారు.**

ఈ కబురు,దిల్లీ: ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. "మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. "నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని రాసుకొచ్చారు. మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

# నేషనల్ హెరాల్డ్ కేసు..
## సోనియా, రాహుల్‌పై ఈడీ సంచలన ఆరోపణ

నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది.ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది.



మొదటి పేజీ తరువాయి

### రాష్టంలో మూడ్రోజుల పాటు వర్షా లు.. అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ కీలక ఆదేశాలు

ఈ కబురు: హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలుపడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు.



# కృష్ణా జలాలలో తెలంగాణకు అన్యాయం.. గత ప్రభుత్వం వల్లే : మంత్రి ఉత్తమ్

ఈ కబురు: కృష్ణ జలాల నీటి వాటాల పంపకాలలో గతంలో 811 టీఎంసీలకు కేటాయింపులో ఆంధ్రాకు 512 టీఎంసీలు తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని దీనివలన తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని గత పదేళ్లు పాలన చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి పంపకాలలో ఏనాడు కొట్లడ లేదని వారు కేటాయించిన 299 టీఎంసీల నీరు సరిపోతాయని అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా రాసి రాశి ఇచ్చి తెలంగాణకు నష్టం చేశారని రాష్ట్ర నీటిపారుదల పౌరసరపాల శాఖ మంత్రి ఎన్ . ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని అంజని సిమెంట్ ఫ్యాక్టరీలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల పంపకంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని తమ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి కలిసి మేమంతా చర్చించి కృష్ణ బోర్డు ట్రిబ్యునల్ లో తెలంగాణ రాష్ట్ర జనాభా సాగు అయ్యే భూమి వీటన్ని అంశాలను వారికి వివరించి 70 శాతం తెలంగాణ కేటాయించాలని... ఆంధ్రకు 30 శాతం కేటాయించాలని తనే స్వయంగా కృష్ణబోర్డు ట్రిబ్యునల్ కు వెళ్లి పోరాటం చేస్తున్నామన్నారు.గతంలో పాలమూరు రంగారెడ్డి నీటి పంపకాల కేటాయింపులు జరగలేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తుమ్మడి హట్టి వద్ద డిజైన్ అయినా చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు 38 వేల కోట్లతో పూర్తయ్యదని... కానీ దానిని టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక డిజైన్ స్థలం మార్చి మేడిగడ్డ వద్ద లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని.. అదే హయాంలో కాళేశ్వరం కూలిపోయిందని అన్నారు. దీనివలన 62 వేల కోట్ల నష్టం వాటిలిందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగాయని విమర్శించారు. ఈ లక్ష కోట్లు ఖర్చుపెడితే కృష్ణా నదిపై అనేక ప్రాజెక్టులు పూర్తి చేయొచ్చునని చెప్పారు. కృష్ణ నదిపై ఏర్పాటు చేసే ప్రాజెక్టులన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

# కాంగ్రెస్, భాజపా
### నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు: కేటీఆర్



చట్టాలు, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి ఇలాంటి పనులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ప్రజాపాలన.. కమీషన్ల పాలనగా మారిందని ఆరోపించారు.

"ఎన్ని నోటీసులు ఇచ్చినా అవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి. న్యాయం, ధర్మం గెలుస్తాయి.. నిజాయతీ ఎప్పటికీ ఓడిపోదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి చనిపోతే ఇంకా మృతదేహాలు బయటకు తీయలేదు. నల్గొండలో సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలింది.. ఇప్పటికీ చర్యల్లేవు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది. రూ.4 వేల పింఛన్ల మాట ఏమైంది" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# గోపన్ పల్లిలో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**రంగనాథ నగర్ భూముల పరిశీలన**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్ పల్లిలో బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. గోపనపల్లిలోని రంగనాథ నగర్ లే అవుట్ లో గల ప్లాట్లను పరిశీలించి స్థానికులతో సమావేశమయ్యారు. రంగనాథ నగర్ లేఅవుట్ లోని తమ ప్లాట్లను కొంతమంది ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేశారని, తమను తమ స్థలాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని పలువురు బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం మధ్యాహ్నం గోపన్ పల్లిలో పర్యటించారు. రంగనాథ నగర్ లేఅవుట్ లోని ప్లాట్లను భూములను పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపనపల్లి పలు సర్వేనెంబర్లలో ఉన్న మొత్తం 120 ఎకరాల 25 గుంటల భూమిలో 1985లో రంగనాథ నగర్ లే ఔట్ చేయగా, ఇందులో 200 గజాల నుంచి 500 గజాల చొప్పున వందలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూములను ఫార్ములా వన్, ఐటీ సెజ్ కింద నోటిపై చేయడంతో కోర్టులో వివాదం కొనసాగుతుందన్నారు. కాగా తాము ప్లాట్లు కొనుగోలు చేసిన తరువాత భూ యజమానుల నుంచి ఎకరాల రూపంలో ఇవే స్థలాలను కొందరు బడాబాబులు కొనుగోలు చేశారని, నాటి నుంచి వివాదం నడుస్తోందని అన్నారు. ఈ భూముల్లో చిన్న చిన్న గదుల నిర్మాణం చేపట్టి తాము పొజిషన్ లో ఉండగా, 2021లో రాత్రికి రాత్రే బడాబాబులు తమ గదులు కూల్చి, దాదాపు 28 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారని వాపోయారు. ఈ విషయమై ప్రభుత్వ కార్యాలయాలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా తమకు న్యాయం దొరకలేదని, హైడ్రా ఆధ్వర్యంలో తమ స్థలాలను తమకు ఇప్పించాలని కోరారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించిన కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ అవతలి వ్యక్తుల వద్ద ఏ విధమైన డాక్యుమెంట్లు ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎవరి వద్ద డాక్యుమెంట్లు న్యాయబద్ధంగా ఉంటే వారికి న్యాయం

# సెలవుల్లో పనిచేయడానికి లాయర్లు ఇష్టపడటం లేదు: సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్



**సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడటం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు.**

ఈ కబురు,ఢిల్లీ: కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్న అంశంపై భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. లాయర్లు సెలవు దినాల్లో పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. వేసవి సెలవుల అనంతరం తన కేసును విచారించాలని ఓ న్యాయవాది కోరారు. సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనానికి ఆ అభ్యర్థన ఆగ్రహం తెప్పించింది. ''న్యాయమూర్తులు సెలవుల్లో పనిచేస్తున్నారు. అయినా సరే పెండింగ్ కేసుల విషయంలో మమ్మల్ని నిందిస్తున్నారు. కానీ, సెలవుల్లో పనిచేయడానికి ఇష్టపడనిది న్యాయవాదులే'' అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పనిచేసే ధర్మాసనాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది.

భారత 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ గతవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. 2019 మే 24న ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆరేళ్లలో సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. 370 అధికరణం రద్దు, ఎన్నికల బాండ్ల రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎస్సీల వర్గీకరణ వంటి అనేక సంచలనాత్మక కేసులలో తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన ఈ ఏడాది నవంబరు 23 వరకు కొనసాగుతారు.

# హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం

హైదరాబాద్,ఈ కబురు: నగరంలో పలుచోట్ల వర్షం దంచికొడుతోంది. సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, బంజారాహిల్స్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, కార్వాన్, మలక్‌పేట్, సైదాబాద్, చాదర్ ఘాట్, మారేడుపల్లి, షేక్‌పేట్, మాదాపూర్, గచ్చిబౌలి, అత్తాపూర్, అంబర్‌పేట్, అత్తాపూర్, రాజేంద్రనగర్, నల్లకుంట, నాచారం, తార్నాక, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ఉప్పల్, రామంతాపూర్‌లో భారీ వర్షం కురుస్తోంది.

ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని నగరం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వానలు పడుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం 'రెయిన్ అలర్ట్' జారీ చేసింది.

ఉపరితల ద్రోణి ఉదయం నుంచి హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాలపై మేఘాలు కమ్ముకోగా.. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఈదురు గాలులతో వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వాన పడుతోంది. మలక్ పేట్, నాంపల్లి, చార్మినార్, దిల్‌సుఖ్ నగర్, కోఠి, రామంతపూర్, అబిడ్స్, అంబర్‌పేట్.. తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది.

ఖైరతాబాద్, లక్డీకాపూల్, రాజ్ భవన్, ట్యాంక్ బండ్ సమీపంలో స్వల్ప వర్షంతో మొదలై.. జడివానగా మారింది. నగర శివారు ప్రాంతాల్లో చోట్ల చిరు జల్లులు పడుతున్నాయి. మరికొన్ని గంటల్లో జంట నగరాల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. అలాగే..

రాత్రి సమయంలో హైదరాబాద్‌లో తీవ్రమైన తుఫాను వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తం అయ్యింది. సాయంత్రం పనులు ముగించుకుని వెళ్లేవాళ్లను అప్రమత్తం చేస్తోంది. మ్యాన్ హోల్స్, కరెంట్ పోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నగర ప్రజలకు సూచించింది.

ఇదిలా ఉంటే.. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాజధాని నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులపాటు ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వానలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. ఇక పంట చేతికొచ్చే సమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలని రైతులకు అధికార యంత్రాంగం సూచిస్తోంది.

తెలంగాణకు రెయిన్ అలర్ట్

వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెయిన్ అలర్ట్ జారీ చేసింది. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉండడంతో.. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ముందస్తు ప్రణాళికలతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. అలాగే..ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్లను సైతం అందుబాటులో ఉండాలని ఆదేశించింది.

''ఋతుపవనాలు ముందుగా రాబోతున్నాయి. అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. 2024లో కురిసిన భారీ వర్షాలకు అందుబాటులో లేకపోవడంతో గోల్డెన్ అవర్ కోల్పోయాం. 2024 సెప్టెంబర్ లాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కావొద్దు. జిల్లాల్లో కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు, సమన్వయం చేసుకోవాలి. సింగరేణి లో ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ టీమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి'' అని సర్క్యులర్‌లో డిజాస్టర్స్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సీఎస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ''ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. కలెక్టర్లు.. కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలి.

హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలి. ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలి. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలి. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి'' అని సీఎస్‌ను ఆదేశించారాయన.



# హార్ట్‌ల్యాంప్' రచయిత్రి బాను ముస్తాక్‌కు బుకర్ ప్రైజ్



**కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ ప్రతిష్ఠాత్మకమైన బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు.**

ఈ కబురు: ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ 2025 ను కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ గెలుచుకున్నారు. 'హార్ట్ ల్యాంప్' అనే చిన్న కథల సంకలనానికి గాను ఆమెను ఇది వరించింది. ఈ ప్రతిష్ఠాత్మక బహుమతి అందుకున్న తొలి కన్నడ రచయిత్రిగా బాను నిలిచారు.

ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను.. పాఠశాల విద్యను అభ్యసిస్తోన్న సమయంలోనే తొలిసారి ఒక షార్ట్ స్టోరీ రాశారు. అయితే, 26 ఏళ్ల వయసులో తన కథ పత్రికలో ప్రచురితమైంది. దాంతో ఆమె ప్రతిభ వెలుగులోకి వచ్చింది. తన తండ్రి ప్రోత్సాహంతో చదువులో రాణించిన ఆమె.. కన్నడ భాషపై పట్టు సాధించారు. తర్వాత ఆమె రిపోర్టర్‌గా, లాయర్‌గా వృత్తిజీవితాన్ని కొనసాగించారు. ఆమె రచయితగానే కాకుండా మహిళల హక్కుల కోసం గళమెత్తారు. మహిళలు ప్రశ్నించకుండా మతం, సమాజం వారిని ఎలాంటి కట్టుబాట్లలో ఉంచుతాయో తన కథల రూపంలో వ్యక్తీకరించారు. హార్ట్‌ల్యాంప్‌తో పాటు ఆరు చిన్న కథల సంకలనాలు, ఒక నవల, మరికొన్ని రచనలు చేశారు. ఆ సాహితీ సేవలకు గుర్తుగా కర్ణాటక సాహిత్య అకాడమీ, దాన చింతామణి అతిమబ్బె అవార్డులు అందుకున్నారు.

# జూన్ 3నుంచి అయోధ్యలో రామ్ దర్బార్ 'ప్రాణ ప్రతిష్ఠ' మహోత్సవం

ఈ కబురు,అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరం నిర్మాణం జూన్ 5 నాటికి ముగుస్తుందని శ్రీ రామ్ జన్మభూమి నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు ఆలయంలో రామ్‌దర్బార్ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూన్ 5న జరిగే ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వివిధ విశ్వాసాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ వేడుకకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వీఐపీలను ఆహ్వానించడంలేదని తెలిపారు. దాదాపు ఐదు వందల ఏళ్ల పోరాటం తర్వాత ఈ క్షణం ఆసన్నమైందన్న నృపేంద్ర మిశ్రా.. రామాలయం నిర్మాణం వెనుక ఎలాంటి రాజకీయ లక్ష్యాలు లేవన్నారు. జూన్ 5 వేడుక అనంతరం వారం రోజుల్లో అయోధ్యలోని రామాలయంలోని కొత్త భాగాన్ని ప్రజల కోసం తెరవనున్నట్లు తెలిపారు.

అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గతేడాది జనవరి 22న కన్నుల పండువగా నిర్వహించిన విషయం తెలిసిందే. మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ప్రాణప్రతిష్ఠ వేడుక నిర్వహించారు. దేశ విదేశాల నుంచి దాదాపు 7,000 మందికి పైగా ప్రముఖులు ఆ మహత్తర ఘట్టాన్ని వీక్షించారు. అనంతరం అయోధ్య మందిరంలో రాముడిని దర్శించుకొనేందుకు ప్రపంచ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు.



# విమానంలో భారీ కుదుపు.. దెబ్బతిన్న ముందుభాగం.. భయాందోళనలో ప్రయాణికులు!



**ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఓ ఇండిగో విమానం గాల్లో ఉండగా తీవ్ర కుదుపులకు గురయ్యింది.**

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తరాది రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో తీవ్ర ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఓ ఇండిగో విమానం గాల్లో ఉండగా తీవ్ర కుదుపులకు లోనైంది. దీంతో పైలట్ వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించారు. చివరకు విమానం సురక్షితంగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విమానం ముందు భాగం దెబ్బతినడం, ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురై కేకలు వేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో 6E2142 విమానానికి ప్రతికూల వాతావరణం ఎదురైంది. దీంతో విమానం తీవ్ర కుదుపులకు లోనయ్యింది. దీంతో అందులో ప్రయాణికులు తీవ్ర భయాందోళలతో అరుపులు, కేకలు వేస్తూ గట్టిగా సీట్లను పట్టుకున్న దృశ్యాలు కనిపించాయి. ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్.. శ్రీనగర్ ఏటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో విమానం సురక్షిత ల్యాండింగ్‌కు చర్యలు చేపట్టారు. చివరకు విమానం సేఫ్ ల్యాండింగ్ అయినట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు వెల్లడించారు. అయితే, విమానం ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది.

# పాక్‌లో.. అప్పట్లో అయూబ్ ఖాన్.. ఇప్పుడు మునీర్.. ఒక్కటే తేడా!

**పాకిస్థాన్‌లో గతంలో సైనికాధిపతిగా పనిచేసిన అయూబ్ ఖాన్ 1959లో తనకు తానే ఫీల్డ్ మార్షల్‌గా ప్రకటించుకున్నాడు.**

ఈ కబురు,: పాకిస్థాన్ సైనికబలగాల ప్రధానాధికారి అసీమ్ మునీర్ ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఇది ప్రత్యేకమైన గౌరవ హోదా. పాక్ అధ్యక్షుడిగా సైనికాధిపతి అయూబ్ ఖాన్ 1958 నుంచి 1969 వరకు పాలించారు. 1959లో తనకు తానే ఫీల్డ్ మార్షల్ గా ప్రకటించుకున్నాడు. దేశంలోని పలువర్గాల నుంచి విపరీతమైన ఒత్తిడి రావడంతో తాను ఆ హోదాను తీసుకోవాల్సి వచ్చిందని అప్పట్లో ఆయనే ప్రకటించడం గమనార్హం. అయితే ఆ పదవి చేపట్టిన అనంతరం సైన్యాధ్యక్షుడి స్థానంలో మూసాఖాన్‌ను నియమించారు.

ఒక్కటే తేడా..

అయూబ్ ఖాన్ తనను తాను ఫీల్డ్ మార్షల్‌గా ప్రకటించుకోగా అసీమ్ మునీర్ మాత్రం 'ప్రభుత్వ ఆమోదంతో' పదవి పొందడం విశేషం. అయితే అయూబ్ ఖాన్ ఫీల్డ్ మార్షల్‌గా నియమితులైన అనంతరం సైనిక బాధ్యతలను వదిలిపెట్టాడు. మునీర్ మాత్రం ఆ పదవిలోనూ కొనసాగుతున్నారు. వాస్తవానికి మునీర్ ఈ ఏడాదే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, ఆయనతోపాటు నౌకాదళం, వాయుసేన అధిపతుల పదవీకాలాన్ని పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ పొడిగించింది. దీంతో మునీర్ 2027 వరకు సైనిక బలగాల ప్రధానాధికారిగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

అమెరికా రక్షణకు బంగారు కవచం.. ఏమిటీ గోల్డెన్ డోమ్..?

భారత్ అంటే అసలు గిట్టని మునీర్‌కు ఈ పదవిని అప్పజెప్పడం గమనార్హం. గతంలో పుల్వామా దాడులకు ఇతను ప్రధాన సూత్రధారి అన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పహల్గామ్ కాల్పులకు తెరవెనక సూత్రధారి ఈయనేననే వాదన ఉంది. అయితే ఆపరేషన్ సిందూర్‌తో మునీర్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అయినప్పటికీ.. పాక్ ప్రధాని అతడికి ప్రమోషన్ కల్పించారు.

ఫీల్డ్ మార్షల్ అంటే?

భారత్, పాకిస్థాన్‌లు గతంలో బ్రిటిషువారి పాలనలో ఉండటంతో సైన్యంలోనూ నాటి సంప్రదాయాలు కొన్ని కొనసాగుతున్నాయి. ఫీల్డ్ మార్షల్ కూడా అలా వచ్చిందే. ఈ హోదాతో జీవితాంతం సైన్యంలో క్రియాశీలకంగా ఉన్నట్టే లెక్క. పదవీ విరమణ అనంతరం సైనిక దుస్తులు ధరించవచ్చు. అలాగే ప్రత్యేకమైన బ్యాడ్జీలు, వాహనంపై ఫైవ్‌స్టార్స్ ఉంటాయి. గౌరవ వందనం కూడా ప్రత్యేకంగా ఉంటుంది.

భారత్‌లోనూ ఇద్దరు ఫీల్డ్ మార్షల్స్ ఉన్నారు. జనరల్ మానెక్‌షా, జనరల్ కరియప్పలకు ఈ హోదా



# అమెరికా సుంకాల ప్రతికూల ప్రభావాన్ని తట్టుకునే స్థితిలో భారత్: మూడీస్


**అమెరికా సుంకాల ప్రభావాన్ని తట్టుకునే స్థితిలోనే భారత్ ఉందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది**

అమెరికా సుంకాల ప్రభావం, ప్రపంచ వాణిజ్య అంతరాయాల ప్రతికూలతలను తట్టుకునే స్థితిలోనే భారత్ ఉందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది. దేశీయ వృద్ధికి ప్రోత్సాహకాలు, ఎగుమతులపై తక్కువ ఆధారపడటం తదితర అంశాలే అందుకు కారణమని వివరించింది.
భారత్‌లో తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి, మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు దోహదం చేస్తున్నాయని మూడీస్ వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, ఆర్థిక వ్యవస్థను మరింత ప్రోత్సహించడానికి వడ్డీ రేట్ల తగ్గింపు లాంటి చర్యలు చేపడుతోందని తెలిపింది.''అమెరికా సుంకాలు, ప్రపంచ వాణిజ్య అంతరాయాలను ఎదుర్కోవడానికి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే.. భారత్ మెరుగైన స్థానంలో ఉంది. దీనికి బలమైన అంతర్గత వృద్ధి, గణనీయమైన దేశీయ ఆర్థిక వ్యవస్థ, ఇతర దేశాలపై తక్కువ ఆధారపడటం వంటివి దోహదం చేస్తున్నాయి'' అని మూడీస్ తన నివేదికలో పేర్కొంది. మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం చేసే వ్యయం జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని.. అదే సమయంలో వ్యక్తిగత ఆదాయ పన్ను కోతలు.. వినియోగాన్ని పెంచుతాయని మూడీస్ వెల్లడించింది.



ఇక ఇటీవల సరిహద్దుల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు .. భారత్ కంటే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయని మూడీస్ వెల్లడించింది. ''పాకిస్థాన్‌తో భారత్‌కు ఆర్థిక సంబంధాలు తక్కువ స్థాయిలో ఉన్నాయి. సరిహద్దుల్లో ఉద్రికత్తలు పెరిగినప్పటికీ.. భారత ఆర్థిక కార్యకలాపాలకు పెద్ద అంతరాయాలు ఉండవని మేం ఆశిస్తున్నాం. మరోవైపు భారత్‌లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువ ఉత్పత్తి చేసే ప్రాంతాలు ఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉన్నాయి'' అని మూడీస్ వివరించింది. అయితే అధిక రక్షణవ్యయం భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. వాణిజ్య చర్చలు ఫలవంతమైతే భారత ఉత్పత్తులు అమెరికాకు భారీగా ఎగుమతి అవుతాయని అంచనా వేసింది.

# గూగుల్ మీట్‌లో రియల్ టైమ్ ట్రాన్స్‌లేట్ ఫీచర్.. ఎలా పని చేస్తుందంటే?




గూగుల్ మీట్‌లో రియల్ టైమ్ ట్రాన్స్‌లేట్ ఫీచర్‌ను టెక్ దిగ్గజం పరిచయం చేసింది. అసలేంటీ ఫీచర్? ఎలా ఉపయోగపడనుందంటే?
ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ కొత్త సదుపాయాలతో ముందుకొచ్చింది. గూగుల్ తన వార్షిక డెవలపర్ సమావేశం 2025లో వీటిని పరిచయం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ మీట్ కోసం సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. రియల్ టైమ్ ట్రాన్స్‌లేట్ సదుపాయాన్ని జోడించినట్లు వెల్లడించింది. ఈ కొత్త సాంకేతికత జెమినీ ఏఐ మోడల్స్ ఆధారంగా పనిచేస్తుందని పేర్కొంది.
డెవలపర్ సమావేశంలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ రియల్ టైమ్ ట్రాన్స్‌లేట్ ఫీచర్‌కు సంబంధించి చిన్న డెమో వీడియోను పంచుకున్నారు. ఈ ఫీచర్ కేవలం క్యాప్షన్లను అనువదించడమే కాకుండా వ్యక్తుల స్వరం, భావోద్వేగం, మాట్లాడే శైలి ఆధారంగా వాయిస్‌ను సైతం అనువాదం చేస్తుందని తెలిపారు. వీడియో కాల్స్‌లో విభిన్న భాషలు మాట్లాడేవారు మాటల్ని సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ ఫీచర్ సాయపడుతుందన్నారు.
ఉదాహరణకు.. గూగుల్ మీట్‌లో మీరు ఆంగ్లంలో మాట్లాడుతుంటే టీమ్‌లో మరో వ్యక్తి స్పానిష్‌లో స్పందిస్తాడనుకుందాం. అలాంటి సమయంలో ఈ సరికొత్త సాంకేతికత మీకు సాయం చేస్తుంది. ఆ వ్యక్తి మాటలను ఏఐ ఆంగ్లంలోకి అనువదించి కేవలం టెక్స్ట్ రూపంలోనే కాకుండా ఇంగ్లిష్ ఆడియో రూపంలోనూ అందిస్తుంది. అలానే మీరు చెప్పే తెలుగులో సమాధానాన్ని కూడా స్పానిష్‌లో మార్చి అచ్చం మీ స్వరంలానే అందిస్తుంది. ఇదంతా రియల్ టైమ్‌లోనే జరుగుతుంది.
గూగుల్ ఏఐ ప్రో, అల్ట్రా ప్లాన్ సబ్‌స్క్రైబర్లకు రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్ టూల్‌ను గూగుల్ రోలవుట్ చేసింది. ప్రస్తుతం ఇంగ్లిష్, స్పానిష్ భాషల అనువాదానికి మాత్రమే సపోర్ట్ చేస్తుంది. రానున్న రోజుల్లో మరిన్ని భాషలకు ఈ ఫీచర్‌ను విస్తరించనున్నారు. గూగుల్ వర్క్‌స్పేస్ బిజినెస్ కస్టమర్ల కోసం ఈ ఫీచర్ ఎంటర్‌ప్రైజ్ వెర్షన్‌ను పరీక్షిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ఏడాది చివరికి ఎంపిక చేసిన కార్పొరేట్ క్లయింట్‌లతో ట్రయల్స్ ప్రారంభించాలని చూస్తున్నట్లు పేర్కొంది.
జీమెయిల్‌లో స్మార్ట్ సమాధానాలు..
జీమెయిల్‌లో సమాధానం పంపాలంటే దాని కింద సజెషన్స్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. అందులో ఏఐ సాంకేతికత మీకు అనేక సజెషన్లు డిస్‌ప్లే చేస్తుంది. మెయిల్‌లో ఉండే సమాచారాన్ని మొత్తం అర్థం చేసుకొని సందర్భోచితంగా ఈ ప్రత్యుత్తరాలు తయారుచేసి మీ ముందు ఉంచుతుంది. అర్థవంతంగా, స్మార్ట్‌గా, సరైన ముగింపుతో సమాధానాలు రూపొందించి వాటిని మీకు చూపుతుంది. అందులో నచ్చిన వాటిని ఎంచుకొని సులభంగా సమాధానాలు పంపొచ్చు.రెండు కొత్త ఏఐ మోడళ్లు..
గూగుల్ తాజా ఈవెంట్‌లో ఇమేజెన్4, వీయో 3 మోడళ్లను విడుదల చేసింది. ఈ కొత్త జనరేటివ్ ఏఐ మోడళ్లు టెక్స్ట్ ప్రాంప్ట్‌ల సాయంతో అధిక నాణ్యత గల చిత్రాలు, వీడియోలను రూపొందించడమే కాకుండా ఆటోమెటిక్‌గా ఆడియోను జనరేట్ చేసి ఇస్తుంది. వీయో 3 వీడియో జనరేషన్ మోడల్.. టెక్స్ట్ లేదా ఇమేజ్ ప్రాంప్ట్‌ల ఆధారంగా హై క్వాలిటీ వీడియో క్లిప్‌లు రూపొందిచొచ్చు.
3డీ వీడియో కాన్ఫరెన్స్ అనుభూతి
మెరుగైన వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని అందించడం కోసం 'గూగుల్ బీమ్' కొత్త ప్లాట్‌ఫామ్‌ను గూగుల్ పరిచయం చేసింది. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు 3డీ అనుభూతిని అందించడం దీని ముఖ్య ఉద్దేశం. అది కూడా ఎలాంటి త్రీడీ గ్లాస్‌లు, హెడ్‌సెట్ ధరించాల్సిన అవసరం లేకుండానే. బీమ్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు హెచ్‌పీతో గూగుల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. యూజర్లను గమనించడానికి వివిధ యాంగిల్స్ నుంచి వివిధ వెబ్‌క్యామ్‌లు ఉపయోగిస్తుంది. ఆ తర్వాత వీడియో స్ట్రీమ్‌లను కలిపి ఏఐ సాయంతో త్రీడీలో డిస్‌ప్లే చేస్తుంది.

# 'అడ్వాన్స్ టిప్'.. ఉబర్‌కు కేంద్రం నోటీసులు

**అడ్వాన్స్ టిప్ పేరిట యూజర్ల నుంచి అదనంగా డబ్బు వసూలు చేస్తున్న ఉబర్‌కు సీసీపీఏ నోటీసులు జారీ చేసింది.**

మహానగరాల్లో సమయం ఆదా చేస్తూ ఒక చోట నుంచి మరో చోటుకు వెళ్లాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది క్యాబ్ సేవలు . చాలా మంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే.. క్యాబ్ బుకింగ్ సమయంలో త్వరితగతిన సేవలు వినియోగించుకునేందుకు అడ్వాన్స్ టిప్ పేరిట అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారు. దీనిపై యూజర్లు ఆందోళన చెందుతున్నారు. రైడ్ బుకింగ్ సమయంలో అడ్వాన్స్ టిప్ అంటూ రూ.50, రూ.75, రూ.100 చూపుతుంది. టిప్ అందిస్తేనే బుకింగ్ త్వరగా అవుతుందని నోట్‌లో తెలియజేస్తోంది. ఇది టిప్ ఇచ్చేందుకు యూజర్‌ను బలవంతం చేస్తోంది. ఒక్కసారి టిప్ ఇస్తే దాన్ని వెనక్కి తీసుకునే అవకాశం లేకుండా పోతోంది. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థ ఉబర్ సేవల్లో అడ్వాన్స్ టిప్ వసూలు అంశం ది కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) దృష్టికి వెళ్లింది. దీంతో ఉబర్‌పై సీసీపీఏ చర్యలకు ఉపక్రమించింది.
ఆ సంస్థకు నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ''అడ్వాన్స్ టిప్ వసూలు చేయడం అనైతికం. వినియోగదారుల నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఇది దోపిడీ చేయడమే. దీనిపై దృష్టి సారించి ఈ అంశాన్ని పరిశీలించాలని సీసీపీఏను కోరాను. అడ్వాన్స్ వసూళ్లపై వివరణ కోరుతూ ఉబర్‌కు నోటీసులు ఇచ్చింది. వినియోగదారుల పట్ల న్యాయంగా వ్యవహరించాలి. సంస్థలు వారితో పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి'' అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, ఉబర్‌తో పాటు ఓలా ఇతర క్యాబ్ బుకింగ్ సేవల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



# మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన సూచీలు



**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 410 పాయింట్లు, నిఫ్టీ 129 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.**

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్ల నుంచి నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు ఓ మోస్తరు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర లాభపడింది. రియల్టీ, ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆటో, బ్యాంక్, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. అయితే, విదేశీ మదుపర్ల అమ్మకాలపై ఆందోళన కొనసాగుతోంది. మార్కెట్లు మరింత పైకి వెళ్లేందుకు ఇవి అడ్డంకిగా మారొచ్చన్న విశ్లేషణలు వినవస్తున్నాయి.
సెన్సెక్స్ ఉదయం 81,327.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,186.44) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,021.64 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 410 పాయింట్ల లాభంతో 81,596.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129.55 పాయింట్ల లాభంతో 24,813.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.64గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,314 డాలర్ల వద్ద స్థిరపడింది.

# మార్కెట్లోకి హోండా మ్యాక్సీ స్కూటర్.. ధర @11.90 లక్షలు



హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా కొత్త స్కూటర్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. పూర్తి వివరాలు ఇవే..
హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా కొత్త మ్యాక్సీ స్కూటర్‌ను దేశీయ మార్కెట్లోకి లాంచ్ చేసింది. హోండా ఎక్స్‌ఏడీవీ పేరిట దీన్ని తీసుకొచ్చింది. దీని ధర రూ.11.90 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. ప్రీమియం రైడర్లను ఆకర్షించేలా కంపెనీ ఈ స్కూటర్‌ను తీసుకొచ్చింది. బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లో బుకింగ్‌లు ఇప్పటికే మొదలయ్యాయని కంపెనీ తెలిపింది. జూన్ నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయని పేర్కొంది.

745సీసీ లిక్విడ్ కూల్డ్ SOHC 8 వాల్వ్ పార్లర్ ట్విన్ ఇంజిన్‌తో ఈ స్కూటర్‌ను తీసుకొచ్చారు. 6,750 RPM వద్ద 57 hp పవర్‌ని, 4,750 RPM వద్ద 69 Nm టార్క్‌ని ఉత్పత్తి చేస్తుంది. డ్యూయల్ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డీఆర్ఎల్‌తో వస్తోంది. ముందు భాగంలో 17 అంగుళాల, వెనకవైపు 15 అంగుళాల స్పోక్ వీల్స్ ఇచ్చారు.

యూఎస్‌బీ టైప్‌సీ ఛార్జింగ్ పోర్ట్, 5 అంగుళాల ఫుల్ కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. హోండా రోడ్‌సింక్ యాప్ కనెక్టివిటీ సాయంతో కాల్స్, ఎస్ఎమ్మెస్ అలర్ట్, టర్న్‌బైటర్న్ నావిగేషన్, మ్యూజిక్, వాయిస్ కమాండ్స్‌ని కంట్రోల్ చేయొచ్చు. రైడ్‌బై రైడ్ టెక్నాలజీ, స్టాండర్డ్, స్పోర్ట్స్, రెయిన్, గ్రావెల్.. నాలుగు రైడింగ్ మోడ్స్‌తో వస్తోంది. హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్ సదుపాయం కూడా ఇందులో ఉంది.


# యాక్సెంచర్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. 15వేల మందికి ప్రమోషన్లు

యాక్సెంచర్ సంస్థ దేశవ్యాప్తంగా 15వేల మందికి ప్రమోషన్లు ఇవ్వనుంది. జూన్‌లో ఈ ప్రక్రియ చేపట్టనుంది.
ప్రముఖ ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగుల్లో 50 వేలమందికి ప్రమోషన్లు ఇవ్వనుంది. భారత్‌లోని 15 వేల మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించనుంది. కన్సల్టింగ్ సేవలకు డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో ఇప్పటికే ప్రమోషన్లు ఆరు నెలలు వాయిదా పడ్డాయి. ఉద్యోగుల్లో మనోస్థైర్యాన్ని నింపేందుకు జూన్‌లో ప్రమోషన్లు ఇవ్వనుంది. ఈ మేరకు ఇంటర్నల్ మెమోలు పంపుతోందని 'బ్లూమ్‌బెర్గ్' వార్తా సంస్థ పేర్కొంది.

భారత్‌లో 15 వేలు, యూరప్‌లో 11 వేలు, పశ్చిమాసియా, ఆఫ్రికాలో కలిపి 11వేలు, అమెరికాలో 10 వేల మంది చొప్పున ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తమ సిబ్బందికి పంపిన అంతర్గత సమాచారంలో తెలిపింది. ప్రస్తుతం యాక్సెంచర్‌లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మొత్తం సిబ్బందిలో జూన్‌లో 6 శాతం మంది సిబ్బంది ప్రమోషన్లు అందుకోనున్నారు. వాస్తవానికి డిసెంబర్‌లోనే ప్రమోషన్ల ప్రక్రియ జరగాల్సిఉంది. కీలక విభాగల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బేస్ పే పెరగనుంది. అయితే బోనస్, పనితీరు ఆధారిత ఈక్విటీపై డిసెంబర్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. కొవిడ్ సమయంలో ఐటీ సేవలకు వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా యాక్సెంచర్ కూడా ఇతర కంపెనీల తరహాలో పెద్దసంఖ్యలో ఉద్యోగుల్ని నియమించుకుంది. ఐటీ సేవలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో 2023లో ఏకంగా 19 వేల మందిని తొలగించింది.



# కేన్స్ లో జాన్వీ ఎంతో స్పెషల్





అందంతో కట్టి పడేయడం.. ఫ్యాషన్ సెన్స్ తో మైమరిపించడం ఈ రెండు లక్షణాలు నేటితరం కథానాయికలకు అవసరం. అయితే అవన్నీ ఉన్నా నటనలో ప్రతిభ లేకపోతే ఎదగడం సాధ్యపడదు. ఆరంభంలో అవకాశాలు అందుకున్నంత సులువు కాదు ఇండస్ట్రీలో మనుగడ సాగించడం. జాన్వీ కపూర్ మాత్రం.. అన్ని అవాంతరాలను ఎదుర్కొని సక్సెస్ వైపు దూసుకెళ్తోంది. పాన్ ఇండియా స్టార్లతో వరుస చిత్రాల్లో నటిస్తూ సహనటీమణులకు గట్టి సవాల్ విసురుతోంది. జాన్వీ కేవలం అందం ఫ్యాషన్ సెన్స్ తోనే కాదు.. ప్రతిభతోను ఈ అవకాశాల్ని అందుకుంది. ప్రస్తుతం కేన్స్ 2025 ఉత్సవాల్లో సందడి చేస్తున్న జాన్వీకపూర్ అక్కడ తనదైన ఫ్యాషన్ సెన్స్ తో ఉర్రూతలూగించింది. తరుణ్ తహిలానియా రూపొందించిన స్పెషల్ డిజైనర్ లెహంగాలో జాన్వీ ఎంతో అందంగా మెరిసిపోయింది. కేన్స్ 2025 ఉత్సవాల్లో కళ్లన్నీ జాన్వీపైనే! ప్రస్తుతం జాన్వీ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. జాన్వీ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్ది చిత్రంలో నటిస్తోంది. బుచ్చిబాబు ఈ చిత్రానినికి దర్శకత్వం వహిస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ నటన ఎలా ఉంటుందో వేచి చూడాలి.



# పవర్' ఫుల్లుగా 'వీరమల్లు'

రెండు తెలుగు రాష్ట్రాల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లాంగ్ అవైటెడ్ చిత్రమే "హరిహర వీర మల్లు". నిజ జీవిత యోధుడు వీరమల్లు జీవిత కథ ఆధారంగా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి సహా జ్యోతికృష్ణలు తెరకెక్కించిన ఈ చిత్రం ఇపుడు విడుదలకి సిద్ధం అవుతుండగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. ఇలా నేడు సినిమా మూడో సాంగ్ ని విడుదల చేయగా ఈ సాంగ్ అనుకున్నట్టుగానే మంచి పవర్ ఫుల్లుగా ఉందని చెప్పాలి. కీరవాణి ఇచ్చిన ట్యూన్ సహా రాంబాబు గోసల సాహిత్యం అంతే స్టన్నింగ్ గా ఉన్నాయని చెప్పవచ్చు. మొత్తం ప్లే బ్యాక్ సింగర్స్ తోనే పాడించిన ఈ పాట ఉత్సాహంగా సాగింది. అలాగే లిరికల్ వీడియోలో విజువల్స్ కూడా బాగున్నాయి. అంతే కాకుండా పవన్ పై పలు పోరాట సన్నివేశాల దృశ్యాలు కూడా ఈ సాంగ్ లో ఫ్యాన్స్ కి ట్రీట్ ఇచ్చేలా కనిపిస్తున్నాయి. మొత్తానికి రెండు సింపుల్ సాంగ్స్ తర్వాత మంచి పవర్ తో కూడిన సాంగ్ ని మేకర్స్ ఇపుడు విడుదల చేసారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి ఏ ఎం రత్నం నిర్మాణం వహించగా ఈ జూన్ 13న పాన్ ఇండియా భాషల్లో సినిమా విడుదల కాబోతుంది.

# కీలక ప్రాజెక్ట్ కు నో చెప్పిన శ్రద్ధ



హారర్ కామెడీ స్త్రీ 2 గ్రాండ్ సక్సెస్ తరవాత శ్రద్ధా కపూర్ పేరు ప్రతిచోటా మారుమోగింది. ఏక్తా కపూర్ కొత్త ప్రాజెక్ట్ కోసం సంతకం చేసిందని కథనాలొచ్చాయి. లాభాలలో వాటాతో పాటు రూ. 17 కోట్లు అడుగుతున్నట్లు గుసగుసలు వినిపించాయి. కానీ ఇప్పుడు పరిస్థితులు అకస్మాత్తుగా మలుపు తిరిగాయి. పేమెంట్ మ్యాటర్స్ లో సమస్య తలెత్తడంతో శ్రద్ధా నిర్ధాక్షిణ్యంగా ఈ ప్రాజెక్టుకు నో చెప్పిందని తెలిసింది. అయితే శ్రద్ధా టూమచ్ కాస్ట్ లీగా ఉందని ఏక్తా భావించిందని కథనాలొస్తున్నాయి. ముఖ్యంగా ఇది నాయికా ప్రధాన చిత్రం కాబట్టి అంత పెద్ద మొత్తం ఒకే పాత్రధారికి చెల్లిస్తే, బడ్జెట్ను దెబ్బతీస్తుందని నిర్మాత ఏక్తా భయపడ్డారట. ప్రస్తుతం ఈ పాత్ర కోసం నిర్మాతలు వెతుకుతున్నారని తెలిసింది. శ్రద్ధా స్థానంలో నటింపజేసేందుకు ఇప్పటికే ఒక అగ్ర నటితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి తుంబాద్ ఫేం రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తారు. ఈ హైకాన్సెప్ట్ థ్రిల్లర్ వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు.



## నా తదుపరి మూవీ రామ్ చరణ్ తోనే సుకుమార్ క్లారిటీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇపుడు భారీ చిత్రం "పెద్ది" చేస్తున్న సంగతి తెలిసిందే. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న ఈ చిత్రం పట్ల పాన్ ఇండియా లెవెల్లో గట్టి అంచనాలు ఉన్నాయి. మరి ఈ చిత్రం తర్వాత బుచ్చిబాబు గురువు దర్శకుడు సుకుమార్ తో చరణ్ 17వ సినిమా అనౌన్స్ అయ్యిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం అనౌన్స్ చేసిన తర్వాత మౌనంగా ఉండడం అనేది కొంచెం ఫ్యాన్స్ లో సస్పెన్స్ గా మారింది. అయితే అసలు ఈ సినిమాపై స్వయంగా సుకుమార్ నుంచే క్లారిటీ వచ్చింది. తన స్వగ్రామం మలికిపురం వెళ్లిన సుకుమార్ అక్కడ తన తదుపరి చిత్రం రామ్ చరణ్ తోనే అని తెలిపారు. ప్రస్తుతం స్క్రిప్ట్ సహా ప్రీప్రొడక్షన్ పనులు చేస్తున్నట్టుగా సెలవిచ్చారు. దీనితో చరణ్ తో సినిమాపై అందరికీ ఒక క్లారిటీ వచ్చినట్టే అని చెప్పవచ్చు.

## స్పెషల్ సాంగ్‌లో మెరిసిన మోనాలిసా..!



విధాత : ప్రయాగ్ రాజ్ మహాకుంభ మేళాలో వెలుగులోకి వచ్చిన పూసలు అమ్ముకునే అమ్మాయి మోనాలిసా మరోసారి వార్తల్లో నిలిచింది. మత్తెక్కించే నీలికళ్ల సుందరిగా మోనాలిసా పేరుతో పాపులర్ అయినా పూసలమ్మి ఆ తర్వాతా సినిమాలు, యాడ్స్ తో బిజీగా మారిపోయింది. ముంబైలో యాక్టింగ్ క్లాసెస్ ద్వారా నటన, డ్యాన్స్ లో నైపుణ్యం సంపాదించిన మోనాలిసా క్రమంగా వెండితెరపై రాణించేందుకు కష్టపడుతోంది. తాజాగా ఆమె ఓ స్పెషల్ సాంగ్‌లో నటుడు ఉత్కర్ష్ సింగ్‌తో కలిసి నటిస్తుంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. త్వరలోనే ఈ సాంగ్ ను యూ ట్యూబ్ లో రిలీజ్ చేయనున్నారు. ఈ సాంగ్ హిట్టయితే మోనాలిసా తన అందం..అభినయంతో వెండితెర హీరోయిన్లకు కొత్త పోటీదారు కానుందంటున్నారు అభిమానులు.

# దిల్లీ ఇంటికి.. చివరి ప్లే ఆఫ్స్ బెర్తు ముంబయిదే



**ఐపీఎల్ 2025లో చివరి ప్లే ఆఫ్స్ చివరి బెర్తును ముంబయి ఇండియన్స్ సొంతం చేసుకుంది.**

ముంబయి: ఐపీఎల్ 2025లో ప్లే ఆఫ్స్ చివరి బెర్తును ముంబయి ఇండియన్స్ సొంతం చేసుకుంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 13 మ్యాచ్‌ల్లో ఎనిమిదో విజయం అందుకున్న హార్దిక్ సేన.. పాయింట్ల పట్టికలో టాప్4లో చోటు దక్కించుకుంది. ఇప్పటికే గుజరాత్, బెంగళూరు, పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఓటమితో దిల్లీ ఇంటిముఖం పట్టింది. లీగ్ స్టేజ్‌లో దిల్లీ తన చివరి మ్యాచ్‌ను పంజాబ్‌తో మే 24న ఆడనుంది. ఇక ముంబయి పంజాబ్ మ్యాచ్ మే 26న జరగనుంది. ఇక్కడా గెలిచి.. మిగతా సమీకరణాలు కలిసొస్తే ముంబయి టాప్ 2లోకి వచ్చే అవకాశం ఉంది.

వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ (73*; 43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో దిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. సమీర్ రిజ్వీ (39) టాప్ స్కోరర్. విప్రాజ్ నిగమ్ (20), అశుతోష్ శర్మ (18) పరుగులు చేశారు. కేఎల్ రాహుల్ (11), డుప్లెసిస్ (6), అభిషేక్ పొరెల్ (6), ట్రిస్టన్ స్టబ్స్ (2) నిరాశపర్చారు. ముంబయి బౌలర్లలో మిచెల్ శాంట్నర్ 3, బుమ్రా 3, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్ జాక్స్, కర్ణ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. వీరి దెబ్బకు ఏ దశలోనూ దిల్లీ లక్ష్యం దిశగా సాగలేదు.

చివర్లో అదరగొట్టిన సూర్య

ముంబయి బ్యాటర్లలో సూర్యకుమార్ కీలక ఇన్నింగ్స్ ఆడగా.. చివర్లో నమన్ ధీర్ (24*; 8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రికెల్‌టన్ (25), విల్ జాక్స్ (21), తిలక్ వర్మ (27) పరుగులు చేశారు. రోహిత్ శర్మ (5), హార్దిక్ పాండ్య (3) నిరాశపర్చారు. దిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 18 ఓవర్లకు 132/5తో ఉన్న ముంబయి 160 కూడా చేయడం కష్టమే అనిపించింది. కానీ, చివరి రెండు ఓవర్లలో ముంబయి 48 పరుగులు రాబట్టింది. ముకేశ్ వేసిన 19 ఓవర్‌లో సూర్య సిక్స్ కొట్టి అర్ధ శతకం (35 బంతుల్లో) అందుకోగా.. తర్వాత నమన్ ధీర్ వరుసగా 4, 6, 6, 4 బాదేశాడు. చమీర వేసిన ఆఖరి ఓవర్‌లో సూర్యకుమార్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు రాబట్టాడు. దిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2, చమీర, ముస్తాఫిజుర్, కుల్‌దీప్ యదవ్ తలో వికెట్ పడగొట్టారు.

ఐపీఎల్‌లో అత్యధికసార్లు ప్లే ఆఫ్స్ చేరిన రెండో జట్టుగా ముంబయి నిలిచింది. చెన్నై సూపర్ కింగ్స్ 12 సార్లు ప్లే ఆఫ్స్ చేరగా.. ముంబయి 11 సార్లు టాప్4లో నిలిచింది.
ఒక సీజన్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరని మొదటి జట్టుగా దిల్లీ చెత్త రికార్డు మూటగట్టుకుంది.

# ఐపీఎల్ నా జీవితాన్ని మార్చివేసింది: విప్రాజ్ నిగమ్



**ఈ ఐపీఎల్ సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు విప్రాజ్ నిగమ్ రాణిస్తున్నాడు.**

ఐపీఎల్ తన జీవితంలో చాలా మార్పులకు కారణమైందని దిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ అంటున్నాడు. క్రికెట్ దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల తన ఆట మెరుగవుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. విప్రాజ్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.50లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో అతడు ఐపీఎల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు.

'ఐపీఎల్‌తో నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లతో మైదానాన్ని పంచుకొని, వారి నుంచి ఆటలో మెళకువలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. దిల్లీ క్యాపిటల్స్ నన్ను ఎంపిక చేసినప్పుడు.. నా కోచ్‌లు, యాజమాన్యంతో చర్చించాను. లీగ్, దేశవాళీ క్రికెట్‌లో వారు నా బ్యాటింగ్‌ను చూశారు. నేను ఆల్ రౌండర్ పాత్ర పోషించాలని వారు ఎప్పుడూ నాకు చెబుతుండేవారు. అందుకే బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తున్నా' అని విప్రాజ్ అన్నాడు.

నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లి వచ్చిన తర్వాత తన ఆటలో వచ్చిన మార్పుల గురించి వివరించాడు. 'నేను ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత ముగ్గురు కోచ్‌లు నా ప్రగతికి కారణమయ్యారు. నేను నిజానికి బ్యాటర్‌గా వెళ్లాను. కానీ అక్కడ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ప్రాక్టీస్ చేశా. ఒక లెగ్ స్పిన్నర్‌గా బౌలింగ్‌ను సీరియస్‌గా తీసుకోమని వారు నాకు సూచించారు. నేను మొదట్లో పార్ట్‌టైమ్ బౌలర్‌గా కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసేవాణ్ని. కానీ ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది' అని విప్రాజ్ నిగమ్ చెప్పుకొచ్చాడు.



# దిగ్వేశ్.. ఎందుకింత ఆవేశం.. వివాదాల 'ముద్ర' అవసరమా?



**వికెట్ తీసినప్పుడు చేస్తున్న సంబరాలు కారణంగా లఖ్‌నవూ బౌలర్ దిగ్వేశ్ రాఠీపై వివాదాల ముద్ర పడింది. ఇది కెరీర్‌కు ఇబ్బంది కలిగించేదే.**

కుర్రాళ్లు దూకుడుగా ఉండాలి. విరాట్ కోహ్లి ఇండియన్ క్రికెట్‌లోకి వచ్చిన దగ్గర నుంచి భారత క్రికెట్‌లో ఈ ఒరవడి ఎక్కువైంది. ప్రత్యర్థిని ఆటతోనే కాకుండా మాటతోనూ ఢీకొనాలనే తత్వం పెరిగింది. వికెట్ పడ్డాక లేదా విజయం సాధించాక దూకుడుగా సంబరాలు చేసుకోవడం ఇందులో భాగమే. కొంతమంది కుర్రాళ్లు ఇదే బాటలో వెళ్తున్నట్లు కనిపిస్తోంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేయర్ దిగ్వేశ్ రాఠీ నే ఇందుకు ఉదాహరణ. విరాట్ గడ్డ దిల్లీ నుంచే వచ్చిన ఈ స్పిన్నర్.. తొలి ఐపీఎల్ లోనే ఆటతో కాకుండా దూకుడుతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచాడు. వికెట్ తీశాక దురుసుగా సంబరాలు చేసుకుంటూ చాలాసార్లు జరిమానాలు ఎదుర్కొన్నాడు. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో అతడు అభిషేక్ శర్మతో గొడవ పడి జరిమానాకు గురయ్యాడు. అంతేకాదు ఒక మ్యాచ్ సస్పెన్షన్ కూడా ఎదుర్కొంటున్నాడు.

సంబరాలపైనే దృష్టి

వికెట్ తీసిన తర్వాత ఏ బౌలర్‌కైనా ఆనందం ఉంటుంది. కానీ సంబరాలు ప్రత్యేకంగా ఉండాలనుకొని దురుసుగా ప్రవర్తిస్తేనే ఇబ్బంది. ఐపీఎల్ 18లో దిగ్వేశ్ మెరుగ్గానే బౌలింగ్ చేశాడు. 12 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీశాడు. తొలి ఐపీఎల్ అన్న ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో బంతులు వేస్తున్నాడు. కానీ వచ్చిన ఇబ్బందల్లా వికెట్ తీసిన ప్రతిసారీ నోట్‌బుక్ టిక్ సంబరాలు చేసుకోవడం. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇలా దూకుడుగా సంబరాలు చేసుకోవడం వల్ల మ్యాచ్ ఫీజులో కోతను ఎదుర్కొన్నాడు.

కొత్త కుర్రాడు కదా! ఆ మాత్రం ఉత్సాహం ఉంటుంది. ఆ తర్వాత తగ్గుతాడని అనుకుంటే నోట్‌బుక్ సంబరాలనే కాస్త మార్చి గడ్డిపై సంతకం చేస్తున్నట్లు సెలబ్రేషన్స్ చేసుకోవడం మొదలుపెట్టాడు. ఐపీఎల్ చర్యలకు ఏమాత్రం బెదరకుండా అతడు తన యాటిట్యూడ్‌ను ప్రదర్శిస్తూనే ఉన్నాడు. ఆరంభంలో కొత్తగా అనిపించినా తర్వాత అభిమానులు కూడా విసుగొచ్చి సామాజిక మాధ్యమాల్లో విమర్శించడం మొదలుపెట్టారు. ఆటగాడిగా పేరు లేదు.. ఆడేది తొలి ఐపీఎల్.. అయినా ఎందుకంత దూకుడు అని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

అభిషేక్‌కి బైబై చెప్పి..

సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో దిగ్వేశ్ దూకుడు ఇంకో దశకు వెళ్లింది. మెరుపు షాట్లతో మ్యాచ్‌ను లఖ్‌నవూకు దూరం చేసిన అభిషేక్ శర్మను ఔట్ చేసిన అతడు మరోసారి సంయమనం కోల్పోయాడు. మళ్లీ నోట్‌బుక్ సంబరాలతో కాస్త దూకుడుగా అభిషేక్‌కు బైబై చెప్పాడు. దీంతో సాధారణంగా నెమ్మదిగా ఉండే అభిషేక్ కూడా నోటికి పని చెప్పాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అంపైర్ వచ్చి సర్దిచెప్పాల్సి వచ్చింది. ఇంకేముంది మళ్లీ దిగ్వశ్‌కు జరిమానా పడింది. అంతేకాదు.. ఈసారి ఓ మ్యాచ్ నుంచి సస్పెండ్ కూడా అయ్యాడు. అభిషేక్‌కు కూడా జరిమానా పడినా దిగ్వేశ్ మాత్రం తన మ్యాచ్ ఫీజులన్నీ జరిమానాలకే వాడుతున్నట్లుందంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.
దిగ్వేశ్ ఆవేశం తగించుకోకపోతే అతడి భవిష్యత్‌కే ఇబ్బందిని కామెంట్లు చేస్తున్నారు. ఎందుకంటే దిగ్వేశ్ ఎంతో కష్టపడి ఐపీఎల్‌కు ఎంపికయ్యాడు. దేశవాళీ మ్యాచ్‌లు ఎక్కువగా ఆడకపోయినా టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు విజయ్ దహియా ప్రోత్సాహంతో లఖ్‌నవూ ఫ్రాంచైజీ దిగ్వేశ్‌పై నమ్మకముంచి వేలంలో తీసుకుంది. సునీల్ నరైన్ శైలి బౌలింగ్.. ఇమ్రాన్ తాహిర్ తలకట్టుతో అతడు ఆరంభం నుంచే అభిమానులను ఆకట్టుకున్నాడు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ లఖ్‌నవూకు మంచి ప్రత్యామ్నాయంగా మారాడు. కానీ అనుచిత ప్రవర్తన, అతి సంబరాలు చేసుకునే శైలి వల్ల అతడి నైపుణ్యం కనుమరుగై.. వివాదాల మనిషి అనే ముద్ర పడుతోంది. జరిమానాలు పడడం పక్కన పెడితే ఈ ప్రవర్తన అతడి కెరీర్‌కు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. వచ్చే ఐపీఎల్‌లోనైనా కొత్త దిగ్వేశ్‌ను చూస్తామేమో!

# ఐపీఎల్ నా జీవితాన్ని మార్చివేసింది: విప్రాజ్ నిగమ్



**ఈ ఐపీఎల్ సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు విప్రాజ్ నిగమ్ రాణిస్తున్నాడు.**

ఐపీఎల్ తన జీవితంలో చాలా మార్పులకు కారణమైందని దిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ అంటున్నాడు. క్రికెట్ దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల తన ఆట మెరుగవుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. విప్రాజ్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.50లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో అతడు ఐపీఎల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు.
'ఐపీఎల్‌తో నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లతో మైదానాన్ని పంచుకొని, వారి నుంచి ఆటలో మెళకువలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. దిల్లీ క్యాపిటల్స్ నన్ను ఎంపిక చేసినప్పుడు.. నా కోచ్‌లు, యాజమాన్యంతో చర్చించాను. లీగ్, దేశవాళీ క్రికెట్‌లో వారు నా బ్యాటింగ్‌ను చూశారు. నేను ఆల్ రౌండర్ పాత్ర పోషించాలని వారు ఎప్పుడూ నాకు చెబుతుండేవారు. అందుకే బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తున్నా' అని విప్రాజ్ అన్నాడు.

నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లి వచ్చిన తర్వాత తన ఆటలో వచ్చిన మార్పుల గురించి వివరించాడు. 'నేను ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత ముగ్గురు కోచ్‌లు నా ప్రగతికి కారణమయ్యారు. నేను నిజానికి బ్యాటర్‌గా వెళ్లాను. కానీ అక్కడ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ప్రాక్టీస్ చేశా. ఒక లెగ్ స్పిన్నర్‌గా బౌలింగ్‌ను సీరియస్‌గా తీసుకోమని వారు నాకు సూచించారు. నేను మొదట్లో పార్ట్‌టైమ్ బౌలర్‌గా కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసేవాణ్ని. కానీ ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది' అని విప్రాజ్ నిగమ్ చెప్పుకొచ్చాడు.

# వచ్చే సీజన్‌లో మరింత మెరుగై వస్తాం: సంజు శాంసన్



ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసింది. ఈనేపథ్యంలో సంజు శాంసన్ తమ తర్వాతి సీజన్ ప్రణాళికల గురించి మాట్లాడాడు.

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసింది. తమ చివరి మ్యాచ్‌ను మంగళవారం దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆడింది. ఈ పోరులో రాజస్థాన్ రాయల్స్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. పది పరాజయాలు, నాలుగు విజయాలతో ఈ సీజన్‌ను రాజస్థాన్ ముగించింది. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజుశాంసన్ మాట్లాడాడు. 'మేం మరింత బాగా ఆడాల్సింది. ఇది అదృష్టానికి సంబంధించింది కాదు. మేం కొన్ని పొరపాట్లు చేశాం. తర్వాతి సీజన్‌కు మరింత మెరుగై వస్తాం. మా ఆటతీరుపై మేమంతా సమీక్షించుకుంటాం' అని శాంసన్ అన్నాడు.

అనంతరం తమ బౌలింగ్, బ్యాటింగ్ గురించి వివరించాడు. 'మా జట్టుకు మంచి యువ బౌలింగ్ లైనప్ ఉంది. మేం జోఫ్రా ఆర్చర్, సందీప్‌ను మిస్సవుతున్నాం. వారికి మంచి భవిష్యత్తు ఉంది. ఆకాశ్ మధ్వాల్ కేవలం నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. షేన్ బాండ్ మార్గదర్శకత్వంలో అతడు రాటుదేలుతున్నాడు. కోచ్ రాహుల్ ద్రవిడ్ కు, మాకు అతడి కఠోర శ్రమ గురించి తెలుసు. మేమంతా అతడి ప్రదర్శనతో సంతోషంగా ఉన్నాం. ఇక వైభవ్ సూర్యవంశీ గురించి చెప్పాలంటే మాటలు చాలడం లేదు. అతడు అద్భుతమైన సెంచరీ బాదాడు. స్లో బాల్స్‌ను ఓవర్ కవర్ మీదుగా కొట్టగలడు. చెన్నైతో మ్యాచ్‌లో చక్కగా ఆడాడు. ఇంత చిన్న వయసులోనే అతడికి ఆటపై చక్కటి అవగాహన ఉంది. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా అద్భుతంగా రాణిస్తున్నాడు' అని సంజు శాంసన్ అన్నాడు.

# సింధు నిష్క్రమణ

భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు పేలవ ఫామ్ కొనసాగుతోంది. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీ నుంచి సింధు తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. బుధవారం మహిళల సింగిల్స్‌లో సింధు 1121, 2114, 1521తో లిన్ నుయెన్ (వియత్నాం) చేతిలో పరాజయంపాలైంది.
కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు పేలవ ఫామ్ కొనసాగుతోంది. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీ నుంచి సింధు తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. బుధవారం మహిళల సింగిల్స్‌లో సింధు 1121, 2114, 1521తో లిన్ నుయెన్ (వియత్నాం) చేతిలో పరాజయం పాలైంది. ఇతర మ్యాచ్‌ల్లో మాళవిక బాన్సోద్ 2119, 1821, 821తో పిన్ చియాన్ (చైనీస్ తైపీ) చేతిలో, ఆకర్షి కశ్యప్ 921, 821తో పుత్రి కుసుమ వర్దని (ఇండోనేసియా) చేతిలో, ఉన్నతి హుడా 1221, 2022తో లిన్ సియాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి శుభారంభం చేశారు. తొలి రౌండ్లో ప్రణయ్ 1921, 2117, 2116తో కెంటా నిషిమోటో (జపాన్)పై, శ్రీకాంత్ 2321, 1321, 2111తో గ్వాంగ్ జు (చైనా)పై, కరుణాకరన్ 2113, 2114తో మూడో సీడ్ తీన్ చెన్ (చైనీస్ తైపీ)పై, ఆయుష్ 2022, 2110, 218తో బ్రయాన్ యాంగ్ (కెనడా)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ప్రియాన్షు రజావత్ 1521, 1721తో హెంగ్ జేసన్ (సింగపూర్) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ 2118, 1521, 2114తో అద్నాన్ మౌలానా ఇదా జమీల్ (ఇండోనేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. రోహన్ కపూర్ గద్దె రుత్విక శివాని జోడీ 1021, 1421తో షిన్ గువో చెన్ ఫాంగ్ (చైనా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

